## నేషనల్ హెరాల్డ్' కేసులో

# ఈడీ ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు




**ఢిల్లీ:** 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై ఏప్రిల్ 25న ఢిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనుంది. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. హరియాణాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్న వారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్న వారు ఇక నుంచి తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియను చేస్తున్నామని తెలిపింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. తాజాగా ఢిల్లీ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. తదుపరి విచారణను కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

### కాంగ్రెస్ మౌనంగా ఉండదు.. సత్యమేవ జయతే: జైరాం రమేశ్

నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడమనేది చట్టబద్ధమైన పాలన ముసుగులో ప్రభుత్వ ప్రాయోజిత నేరంగా కాంగ్రెస్ పేర్కొంది. తమ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర నేతలపై ఛార్జిషీట్ దాఖలు చేయడం.. ప్రధాని, హోంమంత్రి ప్రతీకార రాజకీయాలు, బెదిరింపులకు పాల్పడటం తప్ప మరొకటి కాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ, నాయకత్వం మౌనంగా ఉండబోవన్న ఆయన.. 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

### ఇలాంటి వాటికి కాంగ్రెస్ భయపడదు: ఎంపీ అఖిలేశ్ ప్రసాద్‌సింగ్

కాంగ్రెస్ అగ్రనేతల పేర్లతో ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడంపై ఆ పార్టీ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ సింగ్ స్పందించారు. ప్రతీకారంతో, విపక్ష నేతలను ఉచ్చులో పడేసేందుకు భాజపా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కానీ, ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ భయపడదన్నారు.



## వక్ఫ్ చట్టంపై పాక్ వ్యాఖ్యలు..

### దీటుగా బదులిచ్చిన భారత్

**ఢిల్లీ :** వక్ఫ్ సవరణ చట్టంపై పాకిస్థాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను భారత్ ఖండించింది. అవి నిరాధార, ప్రేరేపిత వ్యాఖ్యలని స్పష్టం చేసింది. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం పాకిస్థాన్‌కు లేదని ఉద్ఘాటించింది. ''భారత పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లుపై పాకిస్థాన్ చేసిన ప్రేరేపిత, నిరాధార వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. భారత్ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడటానికి మీకు ఎలాంటి అధికారం లేదు. మైనార్టీలకు రక్షణ కల్పించే విషయంలో ఇతరులకు బోధించే బదులు పాక్ తన అధ్వాన్న రికార్డును చూసుకోండి'' అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.వక్ఫ్ సవరణ చట్టంపై పాకిస్థాన్ విదేశాంగ అధికార ప్రతినిధి షఫ్‌కత్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. ఓ వర్గం సంబంధిత ఆస్తుల నుంచి వారిని దూరం చేయడానికే ఈ చట్టాన్ని భారత్ తీసుకువచ్చిందన్నారు. అది మైనార్టీలను కించపరచడమేనని ఆయన చెప్పినట్లు పాక్ మీడియా వెల్లడించింది. తాజాగా వీటిపైనే భారత్ దీటుగా స్పందించింది.

## ముడా కేసులో సిద్ధరామయ్యకు షాక్..

### దర్యాప్తు కొనసాగించాలని స్పెషల్ కోర్టు ఆదేశాలు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు షాక్ తగిలింది. ఈ కేసులో లోకాయుక్త పోలీసుల దర్యాప్తు కొనసాగించాలని బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు తుది నివేదికను కోర్టుకు సమర్పించాలని తెలిపింది. ముడా కేసులో లోకాయుక్త పోలీసుల క్లీన్ చిట్ నివేదికను సవాల్ చేస్తూ కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టి ఈ ఆర్డర్స్ జారీ చేసింది.పోలీసులు దర్యాప్తు పూర్తి చేయాలని, అప్పటి వరకు బీ రిపోర్ట్‌పై ఎటువంటి ఆదేశాలు ఇవ్వబోమని న్యాయస్థానం పేర్కొంది. తదుపరి విచారణను మే 7వ తేదీకి వాయిదా వేసింది. అలాగే కర్ణాటక లోకాయుక్త పోలీసులు దాఖలు చేసిన 'బి రిపోర్ట్'కు వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా కోర్టు తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. కాగా, ముడా కేసులో కర్ణాటక సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి సహా ఇతరులపై ఎటువంటి ఆధారాలు లేవని లోకాయుక్త అంతకుముందు తన నివేదికలో పేర్కొంది.

## హార్వర్డ్ యూనివర్సిటీకి నిధుల నిలిపివేత..

### ట్రంప్ కీలక నిర్ణయం




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోని హార్వర్డ్ యూనివర్సిటీకి షాక్ ఇచ్చారు. ఆ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధులను నిలిపివేశారు. అంతేగాక దానికి సంబంధించిన 60 మిలియన్ డాలర్ల కాంట్రాక్టులను సైతం రద్దు చేశారు. క్యాంపస్‌లో యూదు వ్యతిరేకతను అరికట్టాలని అందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల ప్రభుత్వం యూనివర్సిటీకి ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక అడ్మిషన్లు, నియామక పద్ధతుల్లో మార్పులు చేయాలని, ఫేస్ మాస్కులను నిషేధించాలని లేఖ రాసింది. అయితే ఈ డిమాండ్లను హార్వర్డ్ అధికారులు తిరస్కరించారు. హార్వర్డ్ అధ్యక్షురాలు అలాన్ గార్బర్ స్పందిస్తూ ఈ డిమాండ్లు విశ్వవిద్యాలయం హక్కులను ఉల్లంఘించడమే గాక జాతి, రంగు ఆధారంగా వివక్షతను నిరోధించే అధికారాన్ని అణచివేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నిధులను నిలిపివేస్తున్నట్టు వైట్ హౌస్ ప్రకటించింది.ఈ నిర్ణయం పట్ల హార్వర్డ్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ ట్రంప్ పరిపాలనా విభాగం పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, బ్రౌన్, ప్రిన్ స్టన్ వంటి ప్రధాన సంస్థలకు కూడా నిధులు ఆపివేసింది. గాజా యుద్ధం సమయంలో ఇజ్రాయెల్ వ్యతిరేక నిరసనలలో పెరుగుతున్న యూదు వ్యతిరేకతను ఈ సంస్థలు విస్మరించాయని ఆరోపించింది.

## ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం: ఐఎండీ

**ఢిల్లీ:** దేశానికి ఈ ఏడాది రుతుపవన కాలం ఆశాజనకంగా కనిపిస్తోంది. భారత్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం రంగం వాటా 18 శాతం ఉన్నందున.. ఇది రైతులకు శుభవార్త అని నిపుణులు అంటున్నారు.''జూన్ నుంచి సెప్టెంబరు వరకు దేశంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు 87 సెంటీ మీటర్లుగా ఉండగా.. ఈసారి అంతకన్నా ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది'' అని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మెహపాత్ర వెల్లడించారు. ఈ సారి ఎల్‌నినో లాంటి పరిస్థితి ఏర్పడే అవకాశం లేదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ కూడా ఇటీవల తన నివేదికను విడుదల చేసింది.రాబోయే 'నైరుతి' సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. మార్చి వరకు వాతావరణ పరిస్థితులు, పలు అంశాలను విశ్లేషించిన తర్వాత ఈ విషయాన్ని వెల్లడించింది. జూన్ నుంచి సెప్టెంబరు మధ్యకాలంలో దేశంలో సగటున 868.6 మి.మీ వర్షం కురుస్తుందని అంచనా వేస్తోంది. నైరుతి సీజన్ నెమ్మదిగా ప్రారంభమైనా మధ్యలో వర్షాలు వేగం పుంజుకోనున్నాయని పేర్కొంది. పశ్చిమ, దక్షిణ భారతదేశంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.



## ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా..

### ఆరు గంటల పాటు ప్రశ్నించిన దర్యాప్తు సంస్థ



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మనీలాండరింగ్ కేసులో భాగంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. 2008లో హర్యానాలో జరిగిన భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో ఆయనను ఆరు గంటల పాటు అధికారులు ప్రశ్నించారు. మంగళవారం ఈడీ సమన్లు జారీ చేసిన వెంటనే ఆయన ఢిల్లీలోని దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లారు. ఉదయం 11 గంటలకు ఈడీ ఆఫీసుకు వెళ్లిన రాబర్డ్ సాయంత్రం 6 గంటలకు బయటకు వచ్చారు. అనంతరం బుధవారం విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేశారు. దీంతో ఆయన మరోసారి ఇన్వెస్టిగేషన్‌కు హాజరయ్యే అవకాశం ఉంది.ఈడీ విచారణకు హాజరయ్యే క్రమంలో రాబర్డ్ వాద్రా మీడియాతో మాట్లాడారు. ఈ కేసు 20 ఏళ్ల నాటిదని తెలిపారు. రాజకీయ ప్రతీకారంలో భాగంగా తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. 'నేను ప్రజల తరఫున గొంతు వినిపించినప్పుడు, రాజకీయాల్లోకి రావడానికి ప్రయత్నించిన ప్రతి సారి సమన్లు జారీ చేస్తారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం ప్రారంభిస్తారు. ఈ కేసులో ఏమీ లేదు. ఏదైనా గుర్తించడానికి 20 ఏళ్లు పట్టదు. గతంలో 15 సార్లు విచారణకు హాజరయ్యా. 23,000 పత్రాలను సమర్పించా. ఇది రాజకీయ ప్రతీకారం తప్ప మరొకటి కాదు' అని వ్యాఖ్యానించారు.కాగా, 2008 ఫిబ్రవరిలో రాబర్ట్ వాద్రాకు చెందిన కంపెనీ స్కైలైట్ హాస్పిటాలిటీ గురుగ్రామ్‌లోని షికోహాపూర్ గ్రామంలో 3.5 ఎకరాల భూమిని ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ నుంచి రూ.7.5 కోట్లకు కొనుగోలు చేసింది. అనంతరం అప్పటి ప్రభుత్వం ఈ భూమిలో కాలనీని అభివృద్ధి చేయడానికి లైసెన్స్ ఇచ్చింది. కానీ కాలనీని నిర్మించడానికి బదులుగా ఈ భూమిని రూ.58 కోట్లకు విక్రయించింది. అయితే ఈ ఒప్పందంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలున్నాయి.

## బిహార్ ఎన్నికల వేళ..

## ఖర్గే, రాహుల్‌లతో తేజస్వీ కీలక భేటీ!

**పాట్నా:** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ భేటీ అయ్యారు. ఈ కీలక సమావేశంలో ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. రాష్ట్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తేజస్వీ యాదవ్, ఆర్జేడీ ఎంపీలు మనోజ్ ఝా, సంజయ్ యాదవ్ ఖర్గే నివాసంలో భేటీ అయ్యారు. సమావేశం అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు మహాఘట్‌బంధన్ సన్నద్ధత గురించి చర్చించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఎలాంటి ఊహాగానాలు సృష్టించవద్దని కోరారు. ఈ అంశంపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ''బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌ని భాజపా హైజాక్ చేసింది. కేంద్రమంత్రి అమిత్ షా నాయకత్వంలో ఎన్నికల్లో పోటీ చేస్తామని చెబుతున్నారే కానీ, ఆయనే సీఎం అవుతానని మాత్రం చెప్పడం లేదు'' అని తేజస్వీ యాదవ్ విమర్శించారు. ''రాష్ట్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం. బిహార్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కూటమి కట్టుబడి ఉంది. 20 ఏళ్లుగా వారు (నీతీశ్ కుమార్‌ను ఉద్దేశించి) అధికారంలో ఉన్నారు. పదేళ్లకు పైగా ప్రధాని మోదీ కేంద్రంలో ఉన్నారు. కానీ, రాష్ట్రంపై సవతి తల్లి వైఖరి ప్రదర్శించారు. బిహార్ ఆర్థికంగా వెనకబడిన రాష్ట్రం. రైతుల ఆదాయాలు తక్కువ. వలసలు ఎక్కువ'' అని అన్నారు. రైతులు, వెనకబడిన తరగతుల ప్రజలు, యువత, మహిళలు ఇండియా కూటమి అధికారాన్ని కోరుకుంటున్నారని తేజస్వీ అన్నారు. రాష్ట్ర సమస్యలపై కలిసికట్టుగా పోరాడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు ఖర్గే 'ఎక్స్' వేదికగా తమ భేటీ గురించి మాట్లాడారు. ''నేడు బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌తో భేటీ అయ్యాము. మహాఘట్‌బంధన్ బలం గురించి చర్చించాం. భవిష్యత్తుల్లో రాష్ట్ర ప్రజలకు బలమైన, సానుకూల, న్యాయమైన, సంక్షేమాలను అందించాం. రాష్ట్రాన్ని పీడిస్తున్న వారి నుంచి విముక్తి పొందే రోజులు ఆసన్నమవుతున్నాయి'' అని పేర్కొన్నారు.



### చిన్నారుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే..

# ఆస్పత్రి లైసెన్స్ రద్దు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టుఆగ్రహం వ్యక్తం చేసింది. నవజాత శిశువుల అక్రమ రవాణా కేసులో అలహాబాద్ హైకోర్టు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీరుపై మండిపడింది. ఏ ఆస్పత్రిలోనైనా చిన్నారుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేరాలను తగ్గించేందుకు యూపీ ప్రభుత్వానికి కఠిన మార్గదర్శకాలు ఇచ్చింది. ''కుమారుడిని కావాలని ఆశపడిన వ్యక్తి.. రూ.4 లక్షలకు చిన్నారిని కొన్నాడు. ఒకవేళ బిడ్డ కావాలని అనుకుంటే అక్రమ రవాణా చేసే వారిని సంప్రదించాల్సింది కాదు. ఆ చిన్నారిని దొంగతనం చేసి తనకు అందించారనే విషయం నిందితుడికి బాగా తెలుసు. ఇలాంటివారు సమాజానికి ముప్పు. నిందితులు ప్రతి వారం పోలీస్ స్టేషన్‌లో తప్పకుండా హాజరుకావాలి. కానీ, దీనిపై దృష్టిసారించకుండా హైకోర్టు బెయిల్ ఇచ్చింది. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు'' అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. అక్రమ రవాణా పెండింగ్ కేసులకు సంబంధించి విచారణ ఎలా కొనసాగుతోందో తెలియజేయాలని దేశంలోని అన్ని హైకోర్టులను ఆదేశించింది. నిందితుడి బెయిల్ రద్దు చేసింది. ఇలాంటి కేసులకు సంబంధించిన విచారణను 6 నెలల లోపు పూర్తిచేయాలని సూచించింది. రోజూవారీ విచారణను కూడా చేపట్టాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది.

**నవజాత శిశువు చోరీ..**

ఇకపోతే, యూపీలో ఇటీవలే ఒక ఆస్పత్రిలో నవజాత శిశువు చోరీ జరిగింది. దీన్ని గమనించిన ఆ చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఆ శిశువును నిందితుడు విక్రయించాడు. అతడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ తర్వాత ఈ కేసుపై చిన్నారి తల్లిదండ్రులు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో తమకు న్యాయం జరగలేదని ఆరోపిస్తూ.. బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. అలహాబాద్ హైకోర్టుపై మండిపడింది. నిందితుడికి బెయిల్ మంజూరుచేసిన అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

## మ్యాన్ హోల్ క్లీనింగ్‌కు రోబోలు..

○ 'మహా' సర్కారు ప్రయత్నం



**ముంబయి:** మురుగు శుభ్రం చేసేందుకు వెళ్లి మ్యాన్‌హోల్‌లో కార్మికులు ప్రాణాలు కోల్పోయిన వార్తలు తరచూ చూస్తున్నాం. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి ఆలోచన చేసింది. కార్మికుల ఆరోగ్య పరిస్థితిని దృష్టి ఉంచుకుని రోబోలను రంగంలోకి దింపేందుకు యోచిస్తోంది. అందుకు 100 రోబోలను కొనుగోలు చేసేందుకు ప్రణాళిక చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సత్ మీడియాకు వెల్లడించారు. పారిశుద్ధ్య కార్మికుల మరణాలను నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ ఇటీవల విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే పారిశుద్ధ్య పనులపై కేంద్ర సామాజిక, సాధికారత మంత్రిత్వ శాఖ ఆడిట్ నిర్వహించింది. ముంబయి, పుణే, పర్భానీ, సతార...తదితర ప్రాంతాల్లో ఆడిట్ చేయగా.. కార్మికులను రక్షించడంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు విఫలమయ్యారని తేలింది. 202124 మధ్య 18 మంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడైంది. సర్వే చేసిన ప్రాంతాల్లో భద్రతా ప్రోటోకాల్, రక్షణ గేర్, అత్యవసర ప్రతిస్పందన విధానాలు అవసరమైనంత లేవని ఆడిట్‌లో తేలింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం తాజా ప్రకటన చేసింది. ''మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేసేందుకు 27 మున్సిపల్ కార్పొరేషన్లకు 100 రోబోలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం మ్యానువల్‌గా పనులు కొనసాగుతున్నాయి. దేశీయంగా తయారైన రోబోలు ఇందులో ఉపయోగిస్తున్నాం. వీటి సామర్థ్యం కూడా ఎక్కువే. మురుగును శుభ్రం చేయడంతో పాటు.. వ్యర్థాలను వేరు చేస్తాయి. తొలుత ఛత్రపతి శంభాజీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త రోబోలతో కొన్ని రోజుల పాటు ట్రయల్ జరుగుతుంది. ఫలితాలు బాగుంటే.. అన్ని చోట్ల రోబోలను రంగంలోకి దింపుతాం'' అని సంజయ్ శిర్సత్ పేర్కొన్నారు.

## కనుల పండుగగా శిరిడి సాయి, లక్ష్మి మహా యజ్ఞం



**విశ్వంభర, హైదరాబాద్ :** శిరిడి సాయి లక్ష్మి మహా యజ్ఞం ఆదివారం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహా యజ్ఞం గత 26 సంవత్సరాలు షిరిడిలో నిర్వహించానని.. ఈ ఏడాది మొట్టమొదటిసారి హైదరాబాదులో నిర్వహించినట్టు శ్రీ సాయి భక్త లక్ష్మీ భాయ్ షిండే ట్రస్ట్ షిరిడి మేనేజింగ్ ట్రస్టీ లక్ష్మీబాయి షిండే ముని మనవడు అరుణ్ షిండే గైక్వాడ్ పాటిల్ తెలిపారు. 999 హోమగుండాలని ఏర్పాటు చేసి నిర్వహించిన ఈ మహా యజ్ఞంకు సాయి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. షిరిడి సాయిబాబా లక్ష్మీబాయికి స్వయంగా ఇచ్చిన 9 నాణ్యాలను ఈ సందర్భంగా ఆయన ప్రదర్శించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి గీతారెడ్డి హాజరై, ఆసిస్సులు పొందారు. శైలజ మా షిండే గైక్వాడ్ పాటిల్ గీతారెడ్డి తోపాటు నగరంలోని వివిధ సాయి మందిరాల నుంచి వచ్చిన పెద్దలను ఘనంగా సత్కరించారు.

